31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం,ఆగస్టు 30 , 2026 | పేజీలు : 8

## అంజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 29:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంత్ రావు శనివారం సందర్శించారు. కొండగట్టు క్షేత్రానికి చేరుకున్న కమిషనర్‌కు ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు, అర్చక స్వాములు సాదర స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో కొద్దిసేపు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఆలయ విశేషాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు కమిషనర్‌కు శేషవస్త్రం కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వేద పండితుల వేదాశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దేవస్థానానికి సంబంధించిన వివిధ అంశాలను కమిషనర్‌కు వివరించారు.




### అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో

## క్రీడ పోటీల నిర్వహణ

**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు 29 :** క్రీడల పోటీల నిర్వహణ విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం కలగడమే కాకుండా రోజు వారి ప్రక్రియలో ఎదురవుతున్నటువంటి సమస్యలను సైతం అధిగమించవచ్చని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకగా నిర్వహించినటువంటి ప్రత్యేక వేడుకలను ఘనంగా ప్రారంభించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం తో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు జట్టుగా పనిచేసే తత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో చాటాలని ఆకాంక్షించారు అదే విధంగా విద్యార్థుల్లో క్రీడ స్ఫూర్తిని పెంపొందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ దిగ్గజ హాకీ క్రీడాకారుడు - హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ జయంతిని పురిస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులకు పలు క్రీడల పోటీలను నిర్వహించడం జరిగినదని వారు -మిగతా 2లో



## ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుంటాం
- పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా సౌకర్యాలు
- గోదావరి పుష్కరాలకు మరో 40కోట్ల రూపాయలు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**చురకలు ప్రతినిధి, ధర్మపురి, ఆగస్టు 29 :** ధర్మపురి క్షేత్రంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, ఆలయ అభివృద్ధిలో భాగంగా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు తీసుకొని అమలు చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న ఉగ్ర నరసింహ స్వామి దేవాలయం పునర్ నిర్మాణంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తో కలిస శనివారం ధర్మపురి -మిగతా 2లో

### కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు...

## 420 హామీలు అమలు కాలేదు

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 29:** గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు... 420 హామీలు అమలు కాలేదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో జరిగిన జగిత్యాల నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి 1000 రోజులు గడుస్తున్నా అమలు చేయలేదు. ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి అధికారంలోకి వచ్చారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు కూడా అమలు చేయకపోవడం రేవంత్ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ చేయలేని కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కట్టారని, పిల్లర్లు కూలితే కేసీఆర్ ను దోషిగా చూపే కుట్ర చేశారని, కేంద్ర జల సంఘం నివేదిక రేవంత్ కు చెంప పెట్టు అని అన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీరు ఎత్తకుండా రైతుల భూములు ఎండబెడుతున్నారు. నాడు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తే నేడు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని, రైతుబీమాను కనుమరుగు చేశారని, యాప్ పేరిట

-మిగతా 2లో

## చదువుతో పాటు క్రీడలు అవసరం

### జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 29:** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. హాకీ దిగ్గజం భారతరత్న మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవం-2026 సందర్భంగా జగిత్యాల స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ క్రీడా రంగానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. చదువులతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడలు పతకాలకే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలు నేర్పిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మినీ స్టేడియంలో బాస్కెట్ బాల్ కోర్టు పూర్తి చేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తామని, హెచ్చిప -మిగతా 2లో

### అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో

## క్రీడ పోటీల నిర్వహణ

**మొదటి పేజీ తరువాయి....**చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల విద్యార్థులకు వాలీబాల్, ఫుట్బాల్, ఖో-ఖో, కబడ్డీ, హ్యాండ్ బాల్, వాలీబాల్ తదితర క్రీడల పోటీలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## చదువుతో పాటు క్రీడలు అవసరం

**మొదటి పేజీ తరువాయి....**ఆధ్వర్యంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, డివైఎస్ఓ రవిబాబు, కౌన్సిలర్ అరవ లక్ష్మీ రాజు, టిఎన్జీఓ అధ్యక్షులు నాగేందర్, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షులు ఎండి.వకీల్, యూత్ నాయకులు జంగిలి శశి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ఉన్నాం.. భరోసా ఇద్దాం

**నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి :**

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 29 :** ప్రభుత్వం మారినా ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే గ్రామాల్లో భరోసాగా నిలుస్తున్నారని, అదే స్ఫూర్తితో ప్రజల మధ్య ఉంటూ వారికి అండగా నిలవాలని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన నిరసన కార్యక్రమాల పిలుపులో భాగంగా శనివారం ఎల్లారెడ్డిపేటలోని స్టార్ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సెప్టెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు.నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన తీరుపై ప్రజలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దండుకునే పనిలో ఉన్నారని ఆరోపించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదనే విషయం ఆ పార్టీ కార్యకర్తలకు సైతం అర్థమైందని ఘాటుగా విమర్శించారు.బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తుల ఉమ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరిగిన మోసాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని అన్నారు. వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఎలా విస్మరించిందో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాలు సహకరించాలి

**మొదటి పేజీ తరువాయి....**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు కేటాయించాలని అన్నారు.బాసర, కాళేశ్వరం, భద్రాచలంతో ధర్మపురి క్షేత్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం ధర్మపురిలోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తామని తెలిపారు. పునర్ నిర్మాణం కోరకు ప్రభుత్వం రూ.10కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి లోని యోగ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కేంద్రం పరిధిలో ఉన్న నేపథ్యంలో మొదట ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి వివరించారు.
ధర్మపురి అగ్రహారం బ్రాహ్మణులు, వేద పండితులతో పాటు పట్టణ ప్రజల అభిప్రాయాలను తీసుకొని ముందుకు సాగుతామని ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలకు ధర్మపురి నియోజకవర్గానికి ఇప్పటికీ ప్రభుత్వం రూ. 117 కోట్లు కేటాయించింది మంత్రి తెలిపారు. రూ. 40 కోట్లు బైపాస్ రోడ్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు విడుదల కానున్నయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ధర్మపురి లోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణం రూ.10 కోట్లతో చేపడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న యోగా నరసింహ స్వామి ఆలయ ప్రతిష్టకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. స్థపతి ప్రసాద్ ఈ సందర్భంగా పునర్నిర్మాణ వివరాలను వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా గంధ్రాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్ తో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, ధర్మపురి బ్రాహ్మణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు...

# 420 హామీలు అమలు కాలేదు

**మొదటి పేజీ తరువాయి....**
రైతులను వేధిస్తున్నారన్నారు. తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే బోర్నపల్లి వంతెనకు కేసీఆర్ 70 కోట్లు ఇచ్చారు. కేసీఆర్ రాష్ట్రాన్ని కుటుంబంగా చూశారని, 4000 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారని, కేసీఆర్ పేరు చెప్పుకుని రెండుసార్లు ఎమ్మెల్యే అయిన వ్యక్తి ఆ ఇళ్లకు కనీస వసతులు కల్పించలేకపోయారని ఎమ్మెల్యే సంజయ్ పై విమర్శలు చేశారు. గత బిఆర్ఎస్ నిధులతోనే ఇప్పుడు కొబ్బరికాయలు కొడుతున్నారని, మున్సిపల్ భూమిలో పెట్రోల్ బంక్ ఏర్పాటును అడ్డుకోలేకపోయారని నిలదీశారు. రాష్ట్రంలో రేవంత్ ప్రైవేట్ లిమిటెడ్, జగిత్యాలలో సంజయ్ ప్రైవేట్ లిమిటెడ్ నడుస్తోందని, అధికారంలోకి వచ్చాక తిన్న సొమ్మంతా కక్కిస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 2 నుండి జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తోందని, 4000 పెన్షన్, బీడీ కార్మికుల పెన్షన్ హామీలు అటకెక్కాయని విమర్శించారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు, సింగిల్ విండో చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ఎంపీపీలు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# టీచింగ్ రికార్డుల్లో గోల్‌మాల్ ..!

**బిఎడ్. కళాశాలలో**
**అక్రమాల మాయాజాలం**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 29 :** పాఠశాలకు వెళ్లకుండానే ప్రాక్టీస్ రికార్డులా.?సంతకాలు.. ముద్రలపైనా అనుమానాలు.అదనపు వసూళ్ల చేస్తున్నారని ఆరోపణలు.విచారణ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను తీర్చిదిద్దే బి.ఎడ్. కళాశాలలోనే నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. పెద్దపల్లిలోని ఖుద్రత్ నగర్ లోని ఓ బి.ఎడ్. కళాశాలలో టీచింగ్ ప్రాక్టీస్, రికార్డుల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండానే టీచింగ్ ప్రాక్టీస్ రికార్డులు సిద్ధం చేసి సమర్పిస్తున్నారని.. వాటిపై సంతకాలు, పాఠశాల ముద్రల వ్యవహారంలోనూ అక్రమాలు జరుగుతున్నాయని



ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల బి.ఎడ్. కోర్సులో టీచింగ్ ప్రాక్టీస్ కీలకమైనది. విద్యార్థులు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి నిర్ణీత కాలం పాటు ప్రత్యక్షంగా బోధన నిర్వహించాల్సి ఉంటుంది. పాఠశాలలో నిర్వహించిన బోధనా కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను రూపొందించి ప్రధానోపాధ్యాయుడి సంతకం, పాఠశాల ముద్రతో కళాశాలకు సమర్పించాలి. హాజరు వివరాలనూ నిబంధనల ప్రకారం నమోదు చేయాల్సి ఉంటుంది.అయితే కళాశాలలో కొందరు విద్యార్థులు వాస్తవంగా పాఠశాలలకు వెళ్లకుండానే రికార్డులు సిద్ధం చేసి సమర్పిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ రికార్డులపై సంతకాలు, ముద్రల విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

**కేటాయింపులు లేకుండానే**
**పాఠశాలల ఎంపిక..**

టీచింగ్ ప్రాక్టీస్ కోసం అధికారికంగా కేటాయించిన పాఠశాలల్లోనే విద్యార్థులు శిక్షణ పొందాల్సి ఉంటుంది. అయితే అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా పాఠశాలలను ఎంపిక చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులు, హాజరు రిజిస్టర్లు, ప్రాక్టీస్ షెడ్యూళ్లు, ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తే వాస్తవాలు తేలుతాయని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి.

**రికార్డులు తూతూమంత్రం..**

టీచింగ్ ప్రాక్టీస్ రికార్డులను నిర్ణీత ప్రమాణాల మేరకు రూపొందించాల్సి ఉండగా.. వాటిని తూతూమంత్రంగా పూర్తి చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలోనూ పారదర్శకతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవ బోధనా అనుభవం లేకుండా రికార్డులు, ప్రాక్టికల్ మార్కుల ఆధారంగా విద్యార్థులు కోర్సు పూర్తి చేస్తే.. భవిష్యత్తులో వారు సమర్థవంతమైన ఉపాధ్యాయులుగా ఎలా తయారవుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**'టీచింగ్--లెర్నింగ్'**
**పేరుతో అదనపు వసూళ్లు...**

ఇటీవల నిర్వహించిన టీచింగ్ ప్రాక్టీస్ కార్యక్రమాలకు సంబంధించి ఒక్కో విద్యార్థి నుంచి టీచింగ్--లెర్నింగ్ మెటీరియల్ పేరుతో అదనంగా వసూలు చేశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాస్



**చురకలు ప్రతినిధి కోరుట్ల,ఆగస్టు 29 :** కోరుట్ల పట్టణ గంగపుత్ర సంఘం ఎన్నికలు ఇటీవల నిర్వహించగా పట్టణానికి చెందిన పందిరి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌ను ఆమె స్వగృహంలోమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం చైర్‌పర్సన్ కూడా శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ గంగపుత్ర సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు.ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదిస్తే తప్పకుండా సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు బొద్దిరి సతీష్ కుమార్,పాత్రికేయులు కటుకం గణేష్,శ్రీనివాస్,లక్ష్మణ్,దీక్షిత్ పాల్గొన్నారు.

## సత్యసాయి నిత్యాన్న ప్రసాద సేవ షెడ్ పూర్తికి 5 లక్షలు కేటాయింపు



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 29 :** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 2016 నుండి నిరంతరాయంగా కొనసాగుతున్న శ్రీ సత్యసాయి నిత్యాన్న ప్రసాద సేవ కార్యక్రమం ఈ నెల 28తో 10 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సత్యసాయి సంస్థ సభ్యులు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సేవా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందించారు.నూతన మాతాశిశు ఆసుపత్రిలో అన్నప్రసాద సేవ కొనసాగించేందుకు గతంలో 5లక్షలు కేటాయించి షెడ్ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే, తాజాగా షెడ్‌లో వంటగది,ఫ్లోరింగ్, భోజన శాల పూర్తి చేసేందుకు మరో 5 లక్షలు కేటాయించారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి మాతాశిశు ఆసుపత్రిలో కూడా సేవ ప్రారంభిస్తామని సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ తెలిపారు. నిధులు కేటాయించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కు సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిటుమల్ల లక్ష్మీనారాయణ, గుండ రాజశేఖర్, పూటూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ సేన జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా బుస మధు



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 29 :** ఛత్రపతి శివాజీ సేన జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బుస మధును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తోట మధుకర్ తెలిపారు. తెలంగాణలో జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు శివాజీ సేనను మరింత బలోపేతం చేసే బాధ్యతలను మధుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బుసమధు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు తోట మధుకర్ కు, తన నియామకానికి సహకరించిన శివాజీ సేన నాయకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను పదవిగా కాకుండా బాధ్యతగా భావించి పనిచేస్తానన్నారు. శివాజీ సేనను బలోపేతం చేయడంలో ముందుంటానని తెలిపారు.

# సెప్టెంబర్ 7 నుండి మండల స్థాయి క్రీడలు

**-మూడు రోజుల పాటు కబడ్డీ,ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (29) :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి బందారి మధు అధ్యక్షతన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.సెప్టెంబర్ 7న అండర్-14, అండర్-17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు,సెప్టెంబర్ 8న అండర్-14, అండర్-17 బాలురకు కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ పోటీలు, సెప్టెంబర్ 9న అండర్-17 బాల, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అండర్-14 బాల, బాలికల విభాగంలో 01-01-2013 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని, అండర్-17 బాల, బాలికల విభాగంలో 01-01-2010 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు.క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డుతో పాటు సంబంధిత ప్రధానోపాధ్యాయుడి సంతకం తీసుకురావాలని,క్రీడా పోటీలు ఇబ్రహీంపట్నంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు,క్రీడలకు సంబంధించిన ఇతర సందేహాల కోసం మండల కన్వీనర్,పీడీ అనితను 8919053309,పీడీ రాజును 9441183035 నంబర్లలో సంప్రదించాలన్నారు.సమావేశంలో పీడీలు,పీఈటీలు రవి,అనూష, ముత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కృషి

**-రైతులకు,మహిళా సంఘాలకు రుణాల మంజూరులో సహకారం**

**- ఇబ్రహీంపట్నం ఎస్ బి ఐ బ్యాంకు మేనేజర్ భోగ కిరణ్**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (29) :** మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు బ్యాంకు ద్వార కృషి చేస్తామని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఎస్ బి ఐ బ్యాంకు మేనేజర్ భోగ కిరణ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం లోని వర్షకొండ గ్రామంలో బ్యాంకు సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రైతులు, మహిళ సంఘ లను కలిశారు.ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ భోగ కిరణ్ మాట్లాడుతూ రైతులు,మహిళా సంఘాలు,గ్రామీణ ప్రజలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను అందించేందుకు ఎస్‌బీఐ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు బ్యాంకు రుణాలు, ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.అనంతరంసర్పంచ్ వెంకట్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భోగ కిరణ్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ముఖ్యంగా రైతులు,మహిళా సంఘాలకు రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు అందిస్తున్న సహకారం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యం లో సర్పంచ్ వెంకట్ కిరణ్‌ను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమం లో వార్డు సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీహెచ్ఓ విజయభాస్కర్ పదవీ విరమణ

**- ప్రజలకు అందించిన సేవలు అభినందనీయం**

**- సిబ్బంది సమక్షంలో ఘన సన్మానం**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ) గా విధులు నిర్వహించిన విజయభాస్కర్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ విజయభాస్కర్ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారని,ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆయన అందించిన సహకారం, సేవలను గుర్తు చేసుకున్నారు.పదవీ విరమణ అనంతరం విజయభాస్కర్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం విజయభాస్కర్‌ను అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఆయన సేవల ను కొనియాడుతూ జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం లో డీఐఓ డాక్టర్ నరేంద్ర, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజేందర్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ కుమార్, హెచ్ఈ రమణ, పీహెచ్ఎన్ హేమలత, హెచ్‌వీ సుశీల, ఏఎన్ఎంలు రామగిరి సుప్రియ, పులి సుజాత, పద్మ, భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో రైతులకు మేలు



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 29 :** నానో యూరియాతో రైతులు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి లావణ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని రేగుంట గ్రామంలో సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ తో నానో యూరియా వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ద్రవ నత్రజని ఎరువులు 20-50 నానో మీటర్ల పరిమాణంతో ఉండే అతి సూక్ష్మకణాలను కలిగి ఉండటం వలన ఇది అధిక శోషణ రేటును కలిగి ఉంటుంది. ఆకులపై పిచికారీ చేసేటప్పుడు ఆకులలోని పత్రరంధ్రాల ద్వారా నత్రజనిని నేరుగా మొక్క కణాలకు అందించి, 80శాతం కంటే ఎక్కువ పోషకలక్ష్యతను సాధిస్తుంది. ఒక ఎకరానికి 200లీటర్ల నీరు అవసరం అయితే డ్రోన్ ద్వారా ఎకరానికి 10లీటర్ల నీరు మాత్రమే సరిపోతాయని మందు పనితీరు కూడా సమర్ధవంతంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తీట్ల లహరి, ఉపసర్పంచ్ గణవేని నందిని, ఏఈవో వంశీ, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ



**చురకలు విలేకరి, బీర్ పూర్, ఆగస్టు 29 :** బీర్ పూర్ మండల వార్త దినపత్రిక పాత్రికేయుడు వెంకటేష్ తండ్రి మల్లయ్య ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కండ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రవి మామ శీలం లచ్చన్న అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఉప సర్పంచ్ లింగన్న, నాయకులు రవి, సర్పంచులు మారుతి, తోట శ్రీనివాస్, బోడ సాగర్, రంగు లక్ష్మణ్, నాయకులు బుచ్చన్న, మెరుగు రాజేశం, గంగన్న, జలపతి, నర్సయ్య తదితరులున్నారు.

## ఎంఆర్పిఎస్ అధ్యక్షులుగా మునిగే ఎల్లం మాదిగా ఏకగ్రీవం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 29 :** ఎల్లారెడ్డిపేట మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులుగా మునిగే ఎల్లం మాదిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎం ఎస్ పి అందె సామ్యూల్ మాదిగను ఎన్నుకోవడం జరిగింది.ఎంఆర్పిఎస్ అధ్యక్షులుగా మునిగే ఎల్లం మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు నుండి సంత రవి దాసుల ఆశయాలసిద్ధికై వారి అడుగుజాడలతోమ జీవితాలను వెచ్చించిన పూలే అంబేద్కర్ జగ్జీవన్ రావ్ కాన్సిరాం వారసత్వాన్నిముందుకు తీసుకెళ్లడమే మా నూతన కమిటీ లక్ష్యం అని తెలియజేస్తున్నాం.మమ్ములను ఎల్లారెడ్డిపేట మండలంకమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జిల్లా ఇన్చార్జి పుట్ట రవి మాదిగకు ఆవు నూరి ప్రభాకర్ అన్న మాదిగ కు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ కు ఎలగందుల బిక్షపతి మాదిగ కు మాదిగ కుల బంధువులందరికీ సీనియర్ నాయకులకు పెద్దలకు అందరికి మండల కమిటీ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యతోపాటు యువత క్రీడారంగల్లో రాణించాలి



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 29 :** విద్యతో పాటు క్రీడా రంగాల్లో విద్యార్థులు, యువత రాణించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు.శనివారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులను,తెలుగు పండితులను సాలువ మెమొంటోతో ఘనంగా సన్మానించారు.అనంతరం రాయికల్ బాయ్స్ హై స్కూల్ లో బాస్కెట్ బాల్ స్టేట్ పూర్వ క్రీడాకారులు వాసం ప్రసాద్,దాసరి గంగాధర్,బండెల శ్రీనివాస్,తాటిపాముల శ్యామ్,కుర్మ సుదర్శన్ రెడ్డి, దేవేందర్ల సహకారంతో 15 వేల రూపాయలతో బాస్కెట్ బాల్ కోర్టు లో రింగ్స్,కలర్లు, బాస్కెట్ బాల్ ను అందించి కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత,విద్యార్థులకు చదువుతోపాటు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు గ్రామీణ క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు.గ్రామీణ క్రీడాకారులను గుర్తించి క్రీడలపై అవగాహన కల్పించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించడం లో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. క్రీడాకారులను తయారు చేసి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించేలా తీర్చిదిద్ది రాయికల్ మండలానికి పేరు తేవాలన్నారు.క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడి నుండి దూరం చేసి ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,క్లబ్ సభ్యులు బత్తిని భూమయ్య, మ్యకల రమేష్, మచ్చశేఖర్,దాసరి గంగాధర్,కుర్మ సుదర్శన్ రెడ్డి,ఆడెపు రాంప్రసాద్,బాలే నిఖిల్, సాంబారు శ్రీనివాస్,పులి రమేష్,సామల్ల సత్యనారాయణ, వ్యాయామ,తెలుగు పండిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నప్పటి నుంచే పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి

**చురకలు విలేకరి, మెట్పల్లి, ఆగస్టు 29 :** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింప జేస్తారని జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి అన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయం నుంచి క్రీడా ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండ్, శాస్త్రి విగ్రహం, కూరగాయల మార్కెట్ మీదుగా జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్లకు పైగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు లభిస్తే ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి, ఉపాధ్యక్షుడు గజల్ రాందాస్, జ్ఞానేశ్వర్, కొమురయ్య, కార్తీక్, క్రీడాకారుల తల్లిదండ్రులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# కొండగట్టుకు పోటెత్తిన భక్తజనం

**-అభిషేకాలు, ప్రత్యేక పూజలకు భారీగా తరలివచ్చిన భక్తులు**



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 29 :** శనివారం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కొండగట్టుకు చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.శనివారం స్వామివారిని దర్శించుకుని అభిషేకం చేయిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో పలువురు భక్తులు కుటుంబ సమేతంగా కొండగట్టుకు చేరుకుని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఉదయం నుంచే భక్తుల రాక పెరగడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయ పరిసరాలు ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.శనివారం సందర్భంగా కొండగట్టుకు వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం, అభిషేకాలతో పాటు ఆలయ పరిసరాల్లోని పలు ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించి పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో కొండగట్టు క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# ప్రతి పైసాకు లెక్క ఉంది... ప్రతి వ్యవహారానికి రికార్డ్ ఉంది

**-మథర్ థెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘం సభ్యులు**

**-అప్పు కట్టమని అడిగినందుకు ఆరోపణలు**




**చురకలు ప్రతినిధి,మంథని, ఆగస్టు 29 :** మథర్ థెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘంలో ప్రతి పైసాకు లెక్క ఉంది, ప్రతి వ్యవహారానికి ప్రతి రికార్డ్ ఉందని, తీసుకున్న అప్పు కట్టమని అడిగినందుకే ఆరోపణలు చేస్తున్నారని సంఘం సభ్యురాలు పేర్కొన్నారు. శనివారం మథర్ థెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘం సభ్యులు మంథని ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... పొదుపు సహకార సంఘం మహిళల అభివృద్ధి కోరుకునే సంఘమని, ఈ సంఘంలో ప్రతి పైసాకు లెక్క ఉందని వారి వివరించారు. ప్రతి వ్యవహారానికి తూచా తప్పకుండా రికార్డులను నమోదు చేయడమే కాకుండా సంబంధిత రికార్డులకు ఆడిట్ కూడా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. సంఘంలో సభ్యుల వివరాలు, సంఘం వాటా, మూలధనం, జీతభత్యాల గురించి, ప్రతి వ్యవహారానికి సంబంధించిన రికార్డు ఉందని వారు వివరించారు. వాళ్ళ అమ్మ తీసుకున్న అప్పు కట్టమని అడిగినందుకే నామనిహరీష్ ఆరోపణలు చేస్తున్నాడని వారు విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మదర్ తెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘం మేనేజర్ మేకల మల్లేశం, సంఘం అధ్యక్షురాలు మాదేసి పద్మ, డైరెక్టర్ నామని సుగుణ, సభ్యులు ఎలగందుల సరిత, తాత యాదమ్మ, ముప్పిడి మల్లీశ్వరి, మోసం లక్ష్మి, మైదం శారద, పుల్లి లక్ష్మి, పుల్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

# మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

**-ముస్లిం సమాజానికి మౌలాన సయ్యద్ షా ఖాసీం అష్రఫ్ ఉల్ జిలాని పిలుపు**

**-రాజీవ్ చౌక్‌లో సున్నీ మర్కజీ మీలాద్ కమిటీ ఆధ్యాత్మిక సదస్సు విజయవంతం**





**చురకలు ప్రతినిధి,కరీంనగర్, ఆగస్టు 29 :** మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి అనుసరణీయమని,ప్రవక్త సూచించిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని మౌలన సయ్యద్ షా ఖాసీం అష్రఫ్ అష్రఫీ ఉల్ జీలాని కాచౌచ షరీఫ్, ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. నగరంలోని రాజీవ్ చౌక్ లో సున్నీ మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి అధ్యక్షతన జరిగిన ఈద్ మీలాదున్నబీ ఆధ్యాత్మిక సదస్సు విజయవంతమైంది. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా రబివుల్ అవ్వల్ మాసం సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక బహిరంగ సభలో మాట్లాడుతూ.. మౌలాన సయ్యద్ షా ఖాసీం అష్రఫ్ ఉల్ జిలాని మాట్లాడుతూ వారసత్వంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉన్నదని చెప్పారు. నేటి కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ యుగంలో యువత, విద్యార్థులు పెడదారిన పట్టకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా మహమ్మద్ ప్రవక్త జీవిత సూత్రాలు చెప్పారని, వాటిని కుల, మతాలకు అతీతంగా తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. ఈ ఆధ్యాత్మిక సదస్సుకు దాదాపు 1000కి పైచిలుకు ముస్లింలు హాజరై విజయవంతం చేశారు. సదస్సుకు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హాఫీజ్ యూసుఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కరీం జాహిద్, జామియా మస్జిద్ అధ్యక్షుడు సయ్యద్ షా యూసఫోద్దీన్ ఖాద్రి రియాజ్, మౌలానా ఖయ్యుం జియాయి, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, అయ్యుబ్ ఖాన్, హాబీబ్ ఖాద్రి, అబ్బాస్, యూసుఫ్ బేగ్, సయ్యద్ మునీరుద్దీన్ ఖాద్రి, సలావుద్దీన్, ఉమర్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.



# మెట్‌పల్లి తహసీల్దార్ ముఫ్తార్ పాషాకు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 29 :** ఇటీవల మెట్‌పల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ముఫ్తార్ పాషాను మెట్‌పల్లి కాంగ్రెస్ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జాకీర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖయ్యూం, హైమత్, మస్తఖీమ్, ముస్తాకిం మజీద్ నాసర్ తదితరులు పాల్గొన్నారు. నూతన తహసీల్దార్ ముఫ్తార్ పాషాకు వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మెట్‌పల్లి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## అరవింద హైస్కూల్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 29 :** మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని అరవింద హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ,ఆరోగ్యకరమైన పోటీతత్వం, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి,బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతల చెక్కుల పంపిణి



**చురకలు, విలేఖరి,వెల్గటూర్,ఆగస్ట్ 29 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామం లో ఇంకుడు గుంతలు త్రవ్వు కున్నలబ్ధిదారులకు శనివారం జి పి కార్యాలయంలోసర్పంచ్ భూపెల్లిరాజయ్య,ఉపసర్పంచ్ యాగండ్ల గంగరాజం లు చెక్కులు పంపిణీ చేశారు. ఈ ఇంకుడుగుంతలు త్రవ్వడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్బంగా రక్తదాన శిభిరం




**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 29 :** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలానికి చెందిన సీనియ ర్ కాంగ్రెస్ నాయకులు, భక్త ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్, సామాజిక కార్యకర్త మెరుగు నరేష్ గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. వెల్గటూర్ పాత గ్రామపంచాయితీకార్యా లయంవద్దఆయనఅభిమాను లు రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. వివిధపార్టీలనాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా నరేష్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం రోజు బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించడం హర్షనీయమ ని పలువురు అభినందించా రు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,ఆసుపత్రి సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.

## నానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో నానో ఎరువుల వినియోగంపై రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ సుధాకర్ రైతులకు నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, సరైన మోతాదు, పిచికారీ విధానంపై అవగాహన కల్పించారు. నేల ఆరోగ్య పరిరక్షణకు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన ఎరువుల మోతాదులను పాటించాలని, సమతుల్య ఎరువుల వినియోగంతో పంటల దిగుబడిని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగం, యూరియా బుకింగ్ విధానం, సన్న రకాల వరి విత్తనాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై వివరించారు. అలాగే ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆత్మ చైర్మన్ వాకిటి భూమారెడ్డి, సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకార్ లక్ష్మణ్, వ్యవసాయ విస్తరణ అధికారులు సాగర్, వినోద్‌తో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోరండ్ల సొసైటీని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఆగస్టు 29 :** తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్)ను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అల్గునూరు నుంచి మన్నెంపల్లి గ్రామానికి వెళ్తున్న ఆయన మార్గమధ్యలో పోరండ్ల సొసైటీకి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను శాలువాతో సన్మానించారు. అనంతరం సొసైటీ కార్యాలయం, భవనాలను ఎమ్మెల్యే చైర్మన్, డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. సొసైటీ కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాల నిర్వహణ ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో శ్రీనివాస్, సహాయ సీఈవో సురేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్ ప్యాక్స్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, పులి కృష్ణ తోపాటు పలువురు డైరెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, ఫిట్నెస్‌కు వీక్లీ పరేడ్

### -జిల్లా ఎస్పీ జానకి షర్మిల




**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 29 :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ సబ్‌డివిజన్లు,సర్కిల్ పరిధుల్లోని పోలీస్ సిబ్బందికి ఈ రోజు ఉదయం వీక్లీ పరేడ్ నిర్వహించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది బేస్‌లైన్ ఫాలిన్‌లో పాల్గొని, అనంతరం పరేడ్ నిర్వహించారు. నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్, నిర్మల్ రూరల్ సర్కిల్, సోన్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ పరేడ్‌ను నిర్వహించగా,సీఐ కృష్ణ, సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్‌ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. భైంసాలో రవీందర్ సీఐ పరేడ్‌ను నిర్వహించి సిబ్బంది ప్రదర్శించిన డ్రిల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్‌ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ పరేడ్‌ను నిర్వహించగా, ఎస్‌ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్ ద్వారా పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సమన్వయం పెంపొందుతాయని తెలిపారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విధుల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయడం, ఫిట్నెస్‌ను నిరంతరం కాపాడుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. పోలీసులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, చెడు వ్యసనాలు మరియు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత, ఆరోగ్య లేదా విధులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని అధికారులు సూచించారు. వీక్లీ పరేడ్‌లో ఏఆర్, డిసిఆర్ బి, ఐ.టి.కోర్, ఎస్.బి, పిసిఆర్, షి టీమ్, భరోసా తదితర విభాగాల సిబ్బంది కూడా పాల్గొని పరేడ్, డ్రిల్ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

# రైతులు సలహాలు సూచనలు పాటించాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 29 :** రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలి అని కూనారం హెడ్ సతీష్ చంద్ర అన్నారు. ప్రస్తుత వరి మరియు పత్తి లో చీడపీడల నివారణ గురించి శాస్త్రవేత్తల సూచనలు విధిగా రైతులు పాటించాలి.. పుట్నూర్ సర్పంచ్ తోట ప్రశాంత్. పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామంలో వరి మరియు పత్తి పంటలో ప్రస్తుతం ఆశిస్తున్న చీడపీడల పై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ పర్యటన లో ఏ ఆర్ ఎస్ కూనారం పరిశోధన స్థానం హెడ్ డా. సతీష్ చంద్ర మరియు పెద్దపల్లి రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. ఓ. సంపత్ పాల్గొని రైతులకు ముఖ్య సూచనలు చేశారు. మన జిల్లాలో వరి ప్రధాన పంట, ఈ ఏడాది సన్నరకాల వరి పంటల్లో తెగుళ్లు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నాయి, ఆకులు ఎర్రబారుతున్నాయి. గత నెలలో అధిక వర్షాలు కురవడం, వాతావరణంలో మార్పులు మరియు అధికంగా యూరియా వాడడం వల్ల ఈ చీడపీడలు అన్ని పొలాలకు వ్యాప్తి చెందుతున్నాయని శాస్త్రవేత్తలు తెలియజేశారు. వర్షాల తర్వాత మారిన వాతావరణం వల్ల వరి పంటలో కాండం తొలుచు పురుగు (మొగి పురుగు), అగ్గి తెగులు ,తాటాకు తెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు తమ పొలాలను నిత్యం గమనించి, వ్యవసాయ అధికారులను సంప్రదించి సరైన మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొలంలో గాలి, ఎండ తగిలేలా పాయలు తీసి, మందు మొక్క మొదళ్లలో పడేలా పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించాము. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రా/ఎకరానికి లేదా క్లోరాంత్రానిలిప్రోల్ 60 మి.లీ/ఎకరానికి లేదా ఐసోసైక్లోసెరమ్ 120 మి.లీ/ఎకరానికి పిచికారీ చేయాలని సూచించాము. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో అగ్గి తెగులు వ్యాప్తికి అనుకూలంగా ఉన్నాయి ,దీని నివారణకు ట్రైసైక్లోజోల్ ం కార్బెండాజిమ్ 2.5 గ్రా/లీటరు లేదా ఐసోప్రోథియోలేన్ 1.5 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించాము. పత్తిలో ముఖ్యంగా తామర పురుగులు మరియు పచ్చ దోమ మొదలగు రసం పీల్చు పురుగుల ఉధృతి గమనించడం జరిగింది. దీని నివారణకు ఫ్లోనికామిడ్ 0.3 గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా/లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేయాలని సూచించడం జరిగింది. అదే విధంగా పురుగుల నివారణకు పసుపు మరియు నీలి రంగు జిగురు అట్టలను ఎకరాకు 10 చొప్పున ఏర్పాటు చేసుకోవడం ఉపయోగకరమని ఈ సందర్భంగా తెలియజేశారు. రైతులు ప్రతి సీజన్‌లో విత్తనాన్ని కొనకుండా తమ క్షేత్రంలోనే వరి విత్తనాలను అభివృద్ధి చేసుకుని వాడుకుంటే విత్తన పెట్టుబడి మిగలడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, శాస్త్రవేత్తలు డా. శరత్ చంద్ర, డా. ఓ. సంపత్, పుట్నూర్ సర్పంచ్ తోట ప్రశాంత్ మరియు సాగు రైతులు కొమ్ము సత్యనారాయణ, కొండపల్కల రాజయ్య, దుర్గయ్య, పడాల రాజు, చింతకింది సత్తయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# జన్మదినం సందర్బంగా రక్తదాన శిభిరం



**చురకలు,విలేఖరి,వెల్గటూర్, ఆగస్ట్ 29 :** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, భక్త ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్,సామాజిక కార్యకర్త మెరుగు నరేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం జరిపారు. వెల్గటూర్ పాత గ్రామ పంచాయితీ కార్యాలయం వద్దఆయన అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వివిధపార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా నరేష్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం రోజు బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించడం హర్షనీయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ క్రీడతో శారీరక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

**-డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి**



**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు 29 :** ఆధునిక కాలంలో సైక్లింగ్ క్రీడకు ఆదరణ పెరుగుతోందని, ఈ క్రీడ వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ హానరరీ చైర్మన్ డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన "రన్ అండ్ రైడ్" కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాభిమానులు, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు కనీసం 45 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అన్ని వయస్సుల వారు సైక్లింగ్ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో సైక్లింగ్ క్రీడ పట్ల అవగాహన పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత సైకిల్ తొక్కడం తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అతి త్వరలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైక్లింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నెగ్గి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమం కోర్టు వద్ద ప్రారంభమై ఆర్ అండ్ బి చౌరస్తా, తెలంగాణ చౌక్, మంకమ్మ తోట, రాంనగర్, టెలీ-ఫోన్ క్వార్టర్స్ మీదుగా డ్యామ్ కట్టపై చేరి గేట్ల వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ మిట్టపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ మేకల అరవింద్ బాబు, లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, సైక్లిస్ట్ అఖిల్, లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సఫలం అయ్యారు.

# డంప్‌యార్డ్‌ను వెంటనే తరలించాలి

**-గుంజపడుగు హరిప్రసాద్ జిల్లా బాధ్యుడు తెలంగాణ రక్షణ సేన, కరీంనగర్**



**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు, 29 :** డంపింగ్ యార్డ్ తరలించాలని ఈరోజు కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ఈరోజు తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాడం జరిగిందని ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ఇబ్బందిగా మారిన డంప్‌యార్డ్‌ను వెంటనే నగరానికి దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు.ప్రతి రోజు వివిధ డివిజన్ల నుండి దాదాపు నూట యాభై మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. ఇప్పటికే డంపింగ్ యార్డ్ లో నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి ఉంది. పరిసర ప్రాంత ప్రజలతో పాటు కరీంనగర్ లో సగం భాగం ప్రజలు దుర్వాసన, పొగ, దోమలు, కాలుష్యం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. మా పాలన వర్గం అధికారం చెపట్టితే వెంటనే డంప్‌యార్డ్ సమస్య తీరుస్తాం అని కేంద్ర మంత్రులు చెప్పినప్పటికీ డంపింగ్ యార్డ్ మాత్రం శాశ్వత పరిష్కారం ఇంకా చూపలేక పోతున్నారని వారు పేర్కొన్నారు.ఇప్పటికే ప్రభుత్వం డంప్‌యార్డ్‌ను తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించిన పురోగతి లేదని కనీసం ఇప్పటికైనా డంపింగ్ యార్డ్ తరలింపు ప్రక్రియ వేగవంతం చేసి, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోందని వారు అన్నారు.చెత్తను శాస్త్రీయ పద్ధతిలో బయో మైనింగ్ ద్వారా తొలగించే ప్రక్రియ ఏమైందని ఇప్పటికే దాదాపు ఇరవై ఐదు కోట్ల రూపాయల ప్రజాధనాని దుర్వినియోగం చేసినారు. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య వ్యవస్థ పని చెయ్యకుండా పోయింది.తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుంది. కరీంనగర్ డంప్‌యార్డ్‌ను వెంటనే నగరానికి దూరంగా తరలింపు ప్రక్రియ చర్యలు తీసుకోవాలి.పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో పూర్తిగా తొలగించి డంప్‌యార్డ్ వల్ల ప్రజలకు కలుగుతున్న ఆరోగ్య, పర్యావరణ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.నగరంలో తడి, పొడి చెత్తను పూర్తిస్థాయిలో వేరు చేసి శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేయాలి. భవిష్యత్తులో నగర ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత వ్యర్థాల నిర్వహణ విధానం అమలు చేయాలి. నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామని జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మానకొండూరు నియోజకవర్గం ఇన్చార్జి చెన్నమల్ల చైతన్య, బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగవేణి లక్ష్మణ్, బాసవేణి రాజేందర్, ధీటి రమేష్, మడిపల్లి వినీత్, లింగంపల్లి శ్రీనివాస్, కొత్తూరు రఘు, ఎండి హుస్సేన్, నూతి సాయి చరణ్, ఎండి రజి, బి రాజు,విద్యాసాగర్, సూత్రాల రాజన్న, అభిరామ్, పిన్నింటి సంగీతారెడ్డి, ఎండి సల్మా, పొన్నం శిరీష,జంగా అపర్ణ, కొలిపాక గౌతమి, కుతాడి రజిత, కుసుంబ మంజులా రెడ్డి, కొరిమి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి బిజెపి లడాయి



**చురకలు విలేఖరి,జగిత్యాల, ఆగస్టు, 29 :** జగిత్యాల జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఇట్టెడి రాజు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు రావడం జరిగింది గత ఐదు సంవత్సరాలుగా ఇంటర్ మరియు డిగ్రీ మరియు పీజీ విద్యార్థులకు రావలసిన మొత్తం బకాయిలు 15 వేల కోట్లు ఉండగా అందులో విద్యార్థులు 40 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ఉద్యోగాలకు వెళ్లలేక పై చదువులు చదవలేక చదివిన సర్టిఫికెట్లు కాలేజీలోనే ఉంచుతూ ఏమీ చేయలేని నిస్సహాయక స్థితిలో తెలంగాణ విద్యార్థులు అస్తవ్యస్త పరిస్థితిలో జీవితం కొనసాగిస్తున్నారు వీరికి మేము భరోసాగా ఉంటామని తెలంగాణ బిజెపి మరియు బీజేవైఎం మద్దతు తెలుపుతూ నేటి ఒక్కరోజు నిరాహార దీక్ష చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందర్ రెడ్డి జిల్లా ఎస్ఐఆర్ జిల్లా ఇంచార్జ్ పుప్పాల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి నలువల తిరుపతి గారు మరియు పిల్లి శ్రీనివాస్ మరియు వద్దేపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్ , రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు మెుర్రిపల్లి సత్యం , పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుకు సదాశివ్ , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్ , మరియు మున్సిపల్ కౌన్సిలర్లు మరియు వివిధ మోర్చాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బీజేపీ అన్ని మండలాల పట్టణ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, బీజేవైఎం అన్ని మండలాల పట్టణ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన కేకే



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 29 :** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ తండ్రి నన్నే సాబ్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి నన్నేసాబ్ కుమారులైన గౌస్‌ను మరోకూమారుడైన వార్డు సభ్యులు సమద్ మరో కుమారుడు యూసుఫ్‌లను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.అదేవిధంగా రాగట్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సిరిపురం నరేందర్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యం తో మరణించగా నరేందర్‌ను కుటుంబ సభ్యులను మహేందర్ రెడ్డి పరామర్శించారు.అదేవిధంగా అక్క పెల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మందాటి దేవేందర్ తల్లి అనారోగ్యంతో మరణించారు.ఈ విషయం తెలుసుకొని మహేందర్ రెడ్డి గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య,ఏఎంసి పసుల కృష్ణ ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి డైరెక్టర్లు గుల్లపల్లి లక్ష్మారెడ్డి శ్రీనివాస్ యాదవ్ సర్పంచులు బాపురెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్ది లక్ష్మారెడ్డి బండారి బాల్‌రెడ్డి,జి మల్లేశం ఇమామ్,గఫర్ కస్తూరి ప్రవీణ్ రెడ్డి, సిరిపురం మహేంద్ర మల్లారెడ్డి దేవయ్య,కదిరే శ్రీనివాస్ గౌడ్ బాలయ్య గౌడ్ బాలకృష్ణ గౌడ్ పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్ గుర్రాల రాజు రెడ్డి వంగ శ్రీకాంత్ రెడ్డి దొంతి రాజేందర్ రెడ్డి,వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అన్ని కేటగిరిలా వారికీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించాలి

**- యు ఎస్ పి సి జిల్లా శాఖ**



**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు, 29 :** జిల్లాలో యు ఎస్ పి సి ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కె. రాము కు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ఎంపికలో అన్నీ కేటగిరి ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. 2026-27 విద్య సంవత్సరానికి గాను ఉపాధ్యాయుల నుండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు సంబంధించి స్వీయ దరఖాస్తు లు కోరడం జరిగింది. ప్రధానోపాధ్యాయులతో పాటు అన్నీ కేటగిరిల వారికి మండలానికి ఒకటి అవార్డు కేటాయించాలని కోరుచున్నాము.గతంలో జరిగిన పరిస్థితుల దృశ్య ఈ విద్య సంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జ్యూరీ సభ్యుల నియామకం ప్రభావితం చేయగలిగే వ్యక్తులు కాకుండా తటస్థంగా ఉండి ఎంపిక పారదర్శకంగా ఉండేలా చూసే సభ్యులను నియామకం చేయాలని తమరికి యూఎస్పీసి పక్షాన ప్రాతినిధ్యం చేయడం జరిగింది.కార్యక్రమంలో యూఎస్పీసి భాగస్వామ్య సంఘాల నాయకులు తిరుకోవెల శ్యామ్ సుందర్, గట్ల, సంతోష్, ఎద్ద గోవర్ధన్ అంబటి భూమేశ్వర్ లు పాల్గొన్నారు.

# నీటి పొదుపు అందరి బాధ్యత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 29 :** నీటి పొదుపు అందరి బాధ్యత అని గుండారం సర్పంచ్ జంగిలిపోచాలు అన్నారు.శనివారం గుండారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో జలసిరి( నీటి కుంటలు) పై రైతుల అవగాహన కల్పించారు.అనంతరం జలసిరి పోస్టర్ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంటలు కట్టుకోవాలని అన్నారు.ఇంకుడు గుంటలతో భూగర్భ జలాలు పెరుగుతాయని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ జంగిలిపోచాలు,ఉపసర్పంచి అంబీర్ రాజేందర్,వార్డ్ సభ్యులు పిడుగు సదయ్య ,పంచాయతీ కార్యదర్శి బచ్చల ప్రసాద్ మరియు ఏఈఓ నవీన్ ఫీల్డ్ అసిస్టెంట్ ఏలు వాక సతీష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా.. అభివృద్ధి శూన్యమే.!

**-ఇరుకు రహదారి.. గుంతలమయం.. అస్తవ్యస్త డ్రైనేజీ**
**-దాదాపు 25 గ్రామాలకు ఇదే ప్రధాన దారి**
**-అత్యవసర వేళల్లో తప్పని తిప్పలు**
**-వినాయక చవితిలోపు సమస్యలు పరిష్కరించాలని యువకుల డిమాండ్**



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 29 :** ప్రభుత్వాలు మారుతున్నా..పాలకులు మారుతున్నా.. వెల్లుల్ల గ్రామంలో మాత్రం అభివృద్ధి పరిస్థితి మారడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రధాన సమస్యగా ఉన్న రహదారి దుస్థితి నేటికీ అలాగే కొనసాగుతుండటం పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని గ్రామ యువకులు మండిపడుతున్నారు. వెల్లుల్ల గ్రామంలోని గాంధీ విగ్రహం నుంచి గండి హనుమాన్ వరకు ఉన్న రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు అడుగడుగునా గుంతలమయంగా మారింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షం పడితే మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి మీదుగా దాదాపు 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారి అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలు సైతం ఇరుకైన రహదారి, గుంతల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

**ఇక మాటలు కాదు, చేతల్లో చూపించాలి..**

ఎన్నిసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించకపోవడంపై గ్రామ యువకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి ప్రజల ఇబ్బందులను గుర్తించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వినాయక చవితి పండుగలోపు వెల్లుల్ల గ్రామంలోని గాంధీ విగ్రహం నుంచి గండి హనుమాన్ వరకు రహదారిలోని గుంతలను పూడ్చడంతో పాటు, రోడ్డుకు ఇరువైపులా అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలోబాగు చేయాలని కోరుతూ వెల్లుల్ల గ్రామానికి చెందిన యువకులు శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేశారు.

**డెడ్‌లైన్‌లోపు పని మొదలుకాకపోతే.. ఉద్యమమే.!**

ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని యువకులు పాలకులు, అధికారులను హెచ్చరించారు. వినాయక చవితిలోపు రహదారి గుంతలు పూడ్చి, డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని, లేకపోతే తదుపరి కార్యాచరణ మరోలా ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం ఇక సహించేది లేదు.

**పండుగలోపు పనులు ప్రారంభించాలి...**

మాటలతో కాలయాపన చేస్తే గ్రామ ప్రజలు, యువకులతో కలిసి ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని గ్రామ యువకులు హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రత, రాకపోకల సౌకర్యం వంటి అంశాలను కూడా పట్టించుకోకుండా అధికారులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే బాధ్యత ఎవరిదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెల్లుల్ల ప్రధాన రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, యువకులు డిమాండ్ చేస్తున్నారు.



## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా
# హాకీ క్రీడాకారులకు సన్మానం



**-క్రీడాకారులను ప్రోత్సహిద్దాం**
**-లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 29 :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన హాకీ క్రీడాకారులు అఖిల్,అక్షిత్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు.భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువత క్రీడల వైపు ఆకర్షితులయ్యేలా చేయాలని, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ యువతకు బంగారు భవిష్యత్తును అందిద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ టి.వి. సురేష్ బాబు,చైర్మన్లు మేకలమారుతి, మొల్కూరి శ్రీనివాస్,గంట వెంకటరమణ రెడ్డి, మాచర్ల లావణ్య, మల్లి శరణ్య, పట్నం వసుంధర తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి బిజెపి వ్యతిరేకం కాదు

**-ప్రజల అభిప్రాయం మేరకు ఆలయ నిర్మాణం చేయాలి**
**-పట్టణ బిజెపి అధ్యక్షుడు గాజు భాస్కర్**



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 29 :** ధర్మపురి పట్టణ మెజారిటీ ప్రజల అభిప్రాయం మేరకు యోగ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ కోరారు. శనివారం ఆయన విలేఖరు సమావేశంలో మాట్లాడుతూ ఆలయాల భారతీయ జనతా పార్టీ పూర్తిగా కట్టుబడి ఉంది. దేవాలయం అభివృద్ధి చెందాలి, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి, ధర్మపురి మరింత ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలి అనేది మా ఆకాంక్ష అన్నారు.అయితే అభివృద్ధి పేరుతో అనాలోచితంగా నిర్ణయాలు తీసుకోవడం, పట్టణ ప్రజలకు తెలియకుండా కేవలం కొద్దిమందితో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవడం మాత్రం భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.దేవాలయం పునర్నిర్మాణం వంటి అత్యంత సున్నితమైన అంశంపై పట్టణ ప్రజలు, పుర ప్రముఖులు, దేవాలయ భక్తులు, ధార్మిక పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు సంబంధిత నిపుణులతో సమగ్రంగా చర్చించాలని కోరారు.అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలి.ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదన్నారు.

**పుష్కరాలకు కేవలం 8 నెలల సమయం**

ధర్మపురి పుష్కరాలకు ఇంకా సుమారు 8 నెలల సమయం మాత్రమే ఉంది.ఇలాంటి సమయంలో దేవాలయాన్ని కూల్చివేసి పునర్నిర్మాణం చేపడితే పనులు నిజంగా 8 నెలల్లో పూర్తవుతాయా అని ప్రశ్నించారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు ఇబ్బందులు తలెత్తేవా ,భక్తుల రాకపోకలకు, దర్శనాలకు అంతరాయం ,పారిశుధ్యం, వసతి, రవాణా వంటి ఏర్పాట్లపై ప్రభావం పడదా అన్నారు.పుష్కరాల సమయంలో నిర్మాణ పనులు కొనసాగితే ధర్మపురి ప్రతిష్ఠ దెబ్బతినదా అని ఈ ప్రశ్నలకు ప్రభుత్వం, దేవాదాయ శాఖ మరియు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు..పుష్కరాల వంటి అత్యంత పవిత్రమైన సందర్భంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలి. కుంభమేళా స్థాయిలో పుష్కరాలు అంటున్నప్పుడు...కుంభమేళా తరహాలో ధర్మపురి పుష్కరాలను నిర్వహిస్తామని గొప్పగా ప్రకటిస్తున్న నాయకులు, అధికారులు ముందుగా భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉంది. అలాంటి సమయంలో దేవాలయ పరిసరాలను నిర్మాణ పనులతో అస్తవ్యస్తం చేస్తే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.అభివృద్ధి చేయండి... కానీ శాస్త్రీయంగా చేయండి.

**పునర్నిర్మాణం చేయండి... కానీ ప్రజల అభిప్రాయాలతో చేయండి.**

పుష్కరాలను ఘనంగా నిర్వహించండి... కానీ భక్తులకు ఇబ్బంది కలగకుండా చేయండి అని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లవన్ కుమార్, సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్, పల్లెర్ల సురేందర్,జిల్లా ఎండోమెంట్ కో – కన్వీనర్ కలకోట రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, బీజేవైఎం నాయకులు మండలోజి సూరజ్, ఆనందాసు నవీన్, సోమిశెట్టి శివ సాయి, పాత నాగరాజు శర్మ ,పూదరి పవన్, తోట శ్రీనివాస్ శ్యామ్ రావు నాగులు, కొత్తకొండ రాజు, పాత నాగరాజు శర్మ, దీవిట్టి శ్రీకాంత్, కొత్తపెల్లి కిషన్ , సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్, మరియు తదితరులు పాల్గొన్నారు.